


# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

## డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారానికి వినియోగిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** గృహ అవసరాలకు కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ..మిగతా 2లో

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

సోమవారం | 16 | మార్చి | 2026 | పేజీలు: 08


ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం అడిషనల్ కలెక్టర్ (ఏసీఎల్బీ) వెంకటేశ్వర్లు భైంసా మున్సిపాలిటీని సందర్శించి అక్కడ కొనసాగుతున్న కార్యక్రమాలు, వాటి అమలు తీరును పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిని ఆయన సమీక్షించారు.



# పేదల చేరువలో ప్రగతి పథకాలు

## భైంసా మున్సిపాలిటీని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమీక్ష

## ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశాలు




**నిర్మల్, అక్షిత బ్యూరో :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్య క్రమంలో భాగంగా ఆదివారం అడిషనల్ కలెక్టర్ (ఏసీఎల్బీ) వెంకటేశ్వర్లు భైంసా మున్సిపాలిటీని సందర్శించి అక్కడ కొనసాగుతున్న కార్యక్రమాలు, వాటి అమలు తీరును పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో సమావేశమై మాట్లాడిన ఆయన, ప్రభుత్వ పథకాలు ప్రజలకు ..మిగతా 2లో

# కార్మికుల సంక్షేమమే లక్ష్యం

## మున్సిపల్ కమీషనర్ అశ్రిత్ కుమార్

## పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

## 'హ్యాపీ సండే' వేడుకలు

## సందడి చేసిన మహిళా సిబ్బంది




**సిద్దిపేట, అక్షిత ప్రతినిధి :** పర్యావరణాన్ని శుభ్రపరిచి సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచే సఫాయి పారిశుధ్య కార్మికుల రక్షణ వారి ఆరోగ్య సంరక్షణ తమ బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యచరణలో భాగంగా, సిద్దిపేట పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిత్యం మురికి కాలువలు, వీధులను శుభ్రం చేసే కార్మికులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరం ఏర్పాటు ..మిగతా 2లో

# పల్లెల ప్రగతికి కృషి

## ప్రతిష్టాత్మకంగా ప్రగతి ప్రణాళిక

## క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ

## మంత్రి వాకిటి శ్రీహరి



**జడ్చర్ల, అక్షిత న్యూస్ :** ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హాస్పిటల్ లో జనరల్ వార్డులో మాప్ తో శుభ్రం చేశారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసిన మంత్రికి పోలీసులు గౌరవ వందనంతో స్వాగతం ..మిగతా 2లో

# కొమురవెల్లి ఆలయ అభివృద్ధికి కృషి

## శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ





**కొమురవెల్లి, అక్షిత న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రంలలో ఒకటైన శ్రీ కొమురవెల్లి మల్లికార్జున మహాస్వామి దేవస్థానము నందు ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అయినటువంటి కొండా సురేఖ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించి స్వామివారి ఎదుట పట్నం మరియు బోనాలు చెల్లించుకున్నారు.దేవాలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి శేష వస్త్రాలు మరియు తీర్థప్రసాదాలు అందించారు. అదేవిధంగా పరాభవ నామ సంవత్సర నూతన పంచాంగ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి టీ.కృష్ణ ప్రసాద్ ఏఈఓలు రావుల సుదర్శన్,బుద్ధి శ్రీనివాస్ ..మిగతా 2లో

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
సోమవారం |16| మార్చి | 2026

## పేదల చేరువలో ప్రగతి పథకాలు



మొదటి పేజీ తరువాయి...

సమర్ధవంతంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పథకాల అమలుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను సమయానికి అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆదాయ పన్నులపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాపర్టీ టాక్స్, నాన్ టాక్స్ ఆదాయాలు, ట్రేడ్ లైసెన్సులు, ఇండస్ట్రీ ప్రాపర్టీ టాక్స్ వంటి మున్సిపల్ ఆదాయ వసూళ్లను నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు.ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పారదర్శకంగా పాలన కొనసాగించే విధంగా మున్సిపల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, వైస్ చైర్మన్ బీబీ ఖతీజ ఇద్రీస్ బేగ్, మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ జే. మురహరి, ఏం. దేవిదాస్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే లక్ష్యం






మొదటి పేజీ తరువాయి...

చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కార్మికులకు రక్తపోటు, చక్కెర వ్యాధి, కొలెస్ట్రాల్ ప్రొఫైల్, కిడ్నీ సంబంధిత పరీక్షలు మరియు థైరాయిడ్ వంటి కీలక పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఎల్ విప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో పారిశుధ్య కార్మికులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు సమస్యలు ఉన్నవారిని గుర్తించడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో కార్మికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రతి ఏటా వారికి వ్యక్తిగత రక్షణ పరికరాలను అందజేస్తున్నామని కమిషనర్ వెల్లడించారు.

సిడిఎంఎ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం సిబ్బందిలో పని ఒత్తిడి తగ్గించేందుకు 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ మహిళలు, మెప్మా సిబ్బంది మరియు మహిళా పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా ఆటపాటలు నిర్వహించారు. కార్మికులు తమ విధులను పక్కన పెట్టి, ఎంతో ఉత్సాహంతో మరియు పోటీతత్వంతో ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో మున్సిపల్ కార్యాలయం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైద్య బృందం, మెప్మా సిబ్బంది మరియు భారీ సంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

# పల్లెల ప్రగతికి కృషి

మొదటి పేజీ తరువాయి...

పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో ప్రధానంగా 10 అంశాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ముందుగా మున్సిపల్ చైర్మన్లకు, సర్పంచ్ లకు కౌన్సిలర్లకు, వార్డు సభ్యులకు అవగాహన కల్పించి శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలియజేశారు. కొన్ని యేండ్లుగా మరుగున పడిన అనేక అంశాల పట్ల ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతకు ఇదొక ప్రక్షాళన అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరాలని మంత్రి తెలిపారు.అర్రైవ్ –అలైవ్ ప్రోగ్రామ్ ద్వారా రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలియజేశారు. రోడ్లపై వాహనదారులు చేసే చిన్న పొరపాట్ల వల్ల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. కార్లు,బైక్ లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ లు తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు.రహదారులపై బ్లాక్ స్పాట్ లు గుర్తించి స్పీడ్ కంట్రోల్ లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వాహనాలకు వెనక వైపు రేడియం స్టికర్లు తప్పనిసరిగా అంటించాలని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాలేకున్నా





సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్విరామంగా కొనసాగిస్తున్నామని తెలియజేశారు. గతంలో వరి వేస్తే ఉరి అన్నారని కాని ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో వరి వేస్తే సిరి అనేలా చేశామన్నారు. రైతులు పండించిన వరి పంటకు బోనస్ తో పాటు గిట్టుబాటు ధర ఇచ్చి కొట్టున్నామని తెలిపారు. అర్హులైన ప్రతీ పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని గుర్తు చేశారు. మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం చిత్త శుద్ధి తో పని చేస్తుందన్నారు.

స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంక్ ల నిర్వహణ, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ లాంటి పథకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మీ ఆశీర్వాదం తో ఏర్పడ్డ ప్రభుత్వం మీకు సేవ చేయడానికే ఉందన్నారు మంత్రి.సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా మేమశీదరం కడుపు కట్టుకొని పని చేస్తున్నామని తెలిపారు.

మన ప్రాంత బిడ్డ రేవంత్ రెడ్డి సీఎంగా ఉండడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. భూ సేకరణ చేసి భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందిన తర్వాతనే ప్రాజెక్ట్ లు ముందుకు సాగాలని సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారని స్పష్టం చేశారు.

పాలమూరు రంగారెడ్డి అన్ని అనుమతులు తీసుకొని త్వరలో కార్యరూపం దాల్చబోతుందని మంత్రి వెల్లడించారు. రాబోయే రోజుల్ ఈ ప్రాంతం మరో కోనసీమ కావడం ఖాయమన్నారు.మీరిచ్చిన గెలుపుతో మాకు మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి, మహబూబ్ నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మున్సిపల్ చైర్మన్ పుష్పలత, డీఎం హెచ్ ఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

మొదటి పేజీ తరువాయి...

భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, కాగజ్ నగర్ డిఎస్ పి వహీదుద్దీన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ, పౌరసరఫరాలు, మున్సిపల్ శాఖల అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని, ప్రస్తుతం జిల్లాలో ఎల్ పి జి, పెట్రోల్ కొరత లేదని తెలిపారు. ఎల్ పి జి గోదాముల, పెట్రోలు బక్కుల వద్ద స్టాకు వివరాలను పట్టికలో ప్రదర్శించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోజుకు 2 వేల చొప్పున బుకింగ్ చేసుకున్న వారికి సిలిండర్లు అందించడం జరుగుతుందని, ప్రతిరోజు ఎల్ పి జి సిలిండర్ల నిల్వలు, పంపిణీ





వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, గురుకులాల అవసరాలకు సరిపడా సిలిండర్లు అందించాలని, హోటల్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులు ఎట్టి పరిస్థితులలో డొమెస్టిక్ సిలిండర్ లను వ్యాపారానికి వినియోగించరాదని తెలిపారు. పెట్రోల్ బంకులలో పెట్రోల్ ను ప్లాస్టిక్ క్యానులలో పోయరాదని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో 45 రోజులు, పట్టణ ప్రాంతాలలో 25 రోజుల సిలిండర్ల బుకింగ్ గడువు ఉందని, పత్రికలు, మీడియా/సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల కథనాలపై వెంటనే స్పందించి అదే రోజు జిల్లా పౌర సంబంధాల అధికారికి రిజాయిండర్లను సమర్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రవాణా, అగ్నిమాపక, సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్ పిజి డీలర్లు, పెట్రోల్ బంకుల యజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి ఆలయ అభివృద్ధికి కృషి





మొదటి పేజీ తరువాయి...

ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ మరియు అర్చక బృంద మరియు కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, కార్యకర్తలు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గంగం నరసింహారెడ్డి, ధర్మకర్తలు సార్లు లింగం, బొచ్చు ఎల్లయ్య, ఎలగల మల్లేశం, చిగిరి కొమురయ్య, మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# "ఆపరేషన్ క్రాక్‌డౌన్" కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు

### 12 మంది నిందితుల అరెస్ట్




**కరీంనగర్ అక్షిత బ్యూరో :** జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ క్రాక్‌డౌన్" లో భాగంగా ఒక భారీ వ్యవస్థీకృత నేర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సైబర్ మోసాలకు కీలకమైన "మ్యూల్ బ్యాంక్ ఖాతాలను" సృష్టించి సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారితో సహా 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి కరీంనగర్ 2 టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తులో భాగంగా ఈ ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు అమాయక వ్యక్తుల పేరుతో లేదా స్వయంగా వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, కరెంట్ ఖాతాలను తెరిచేవారు. ఆ ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులను పైస్థాయి సైబర్ నేరగాళ్లకు విక్రయించేవారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు గురైన బాధితుల డబ్బును చేతులు మార్చడం, ఉపసంహరించుకోవడం చేసేవారని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం పోలీసులు ప్రధాన నిర్వాహకుడు రాజేశ్వర్ రెడ్డి తో పాటు కరీంనగర్‌కు చెందిన మరో 11 మంది సహచరులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో కరీంనగర్ పట్టణం భగత్‌నగర్ కు చెందిన ముదుగంటి రాజేశ్వర్ రెడ్డి (22) తండ్రి: శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ నగర్ చెందిన నందగిరి సాయి వర్ధన్ (22) తండ్రి: ఈశ్వరాచారి, ధోబీవాడకు చెందిన కాలిదాస్ కౌశిక్ (23) తండ్రి: కన్నయ్య, కట్టరాంపూర్ కు చెందిన ములంకుల రాజ్‌కుమార్ (23) తండ్రి: కంకయ్య, శంకరపట్నం మండలం కన్నాపూర్ కు చెందిన బండి సాయి కృష్ణ (26) తండ్రి: సదయ్య, కరీంనగర్ పట్టణం విద్యానగర్ కు చెందిన అడవెల్లి సాయి కార్తిక్ (23) తండ్రి: కుమార్, సవరన్ స్ట్రీట్ కు చెందిన మీర్ జామీ ఉద్దీన్ (22) తండ్రి: మీర్ జాకీ ఉద్దీన్,మహమ్మద్ జవాద్ ఖాన్ (23), తండ్రి: మహమ్మద్ సాజిద్ ఖాన్,కోతిరాంపూర్ కు చెందిన సర్దార్ దల్జీత్ సింగ్ (23) తండ్రి: సర్దార్ గోవింద్ సింగ్,రామడుగు మండలం లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి కు చెందిన పల్లెర్ల అజయ్ (24) తండ్రి: రాజు, కరీంనగర్ పట్టణం మారుతినగర్ చెందిన నిర్మల్ల శివ (23) తండ్రి: శ్రీనివాస్, చొప్పదండి మండల రుక్మాపూర్ కు చెందిన దిద్దీ సాయి చరణ్ (22) తండ్రి: నాగరాజు లు ఉన్నారు.




ఈ ముఠా సభ్యులు కేవలం ఒక్క కేసులోనే కాకుండా, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ఇతర కేసులలో ప్రమేయం ఉన్నట్లు కమిషనర్ తెలిపారు.


ఈ నిందితులు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. వీరి వద్ద నుండి కీలక పత్రాలు, బ్యాంక్ కిట్లు మరియు ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుచినట్లు, వీటిపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని సీపీ తెలిపారు. ఆపరేషన్ క్రాక్‌డౌన్" కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు చేయడంలో సమర్థవంతంగా పనిచేసి ఈ అంతరాష్ట్ర ముఠాను పట్టుకున్న కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనాథ్ , పోచయ్య , సైబర్ క్రైమ్ ఎస్సై అనిల్ , కానిస్టేబుల్ అనిల్, సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ నుండి వసీం , ఖాజా పాషా , రవి , వెంకటేష్, టూ మరియు త్రి టౌన్ లకు చెందిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణా రెడ్డి , శ్రీనివాస్ ,శంకర్ , లక్ష్మణ్ , పోలీసు కానిస్టేబుళ్లు సాయి కృష్ణ , అభినవ్ పోలీస్ అధికారులను, సిబ్బందిని, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచనలు చేశారు. తెలియని వ్యక్తులకు బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం, ఇతరుల కోసం అకౌంట్లు తెరవడం లేదా మీ ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా నేరమని, ఇలా చేయడం వల్ల కూడా సైబర్ నేరాలలో భాగస్వాములు అవుతారని, కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని కరీంనగర్ పోలీసులు హెచ్చరించారు.

# ముధోల్ నియోజకవర్గానికి రూ.3.12 కోట్లు మంజూరు

### 9 గ్రామాలకు పంచాయతీ భవనాలు, 11 గ్రామాలకు అంగన్వాడీ భవనాల నిర్మాణం

### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి కృతజ్ఞతలు





PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR & DPC, MGNREGS, NIRMAL

Present: Smt. Abhilasha Abhinav, IAS.,

Proc No. A17/529/DCC/2024 Dated: .02.2026.

Sub : MGNREGS – Nirmal District – Construction of Gram Panchayat building for Administrative/Financial Sanction – Orders Issued – Regarding.

Ref: Endorsement NO.706, Dt: 25.02.2026 of Hon'ble in-charge Minister Nirmal Sri. Jupally Krishna Rao Garu.

ORDER:

Through the references cited above, Hon'ble in-charge Minister Nirmal Sri. Jupally Krishna Rao Garu has endorsed the proposal for Construction of Gram Panchayat building as mentioned in annexure.

After careful examination of the proposals the Administrative/ Financial sanction for above work with an estimate cost of **Rs.180.00 Lakhs** (Rupees One Crores Eighty lakhs only) hereby accorded for taking up construction of Gram panchayat buildings for the year 2025-26.

The District Panchayat Raj Engineer, Nirmal concerned are hereby instructed to execute the above said work and complete the works by 31st March 2026 duly following the existing MGNREGS norms laid down in MGNREG Act, 2005, Annual Master Circular 2024-25 and other guidelines communicated by the Government time to time.

District Collector/DPC (MGNREGS), Nirmal District.

To
The District Panchayat Raj Engineer, Nirmal.
Copy submitted to the Commissioner, Rural Development, Hyderabad.
Copy to the DRDO, DRDA, Nirmal.
Copy to the DPO,Nirmal.

**నిర్మల్ అక్షిత బ్యూరో:** ముధోల్ నియోజకవర్గంలోని గ్రామీణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గంలోని 9 గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ఒక్కొక్కటికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.1 కోటి 80 లక్షలు మంజూరు చేసింది. అలాగే 11 గ్రామాల్లో అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్కొక్కటికి రూ.12 లక్షల చొప్పున రూ.1 కోటి 32 లక్షలు కేటాయించింది. ఇలా మొత్తం కలిపి రూ.3 కోట్ల 12 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులు మంజూరు చేయడంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ముధోల్ నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి, ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు బీమా..

### ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో పంచాయతీ సిబ్బందికి సన్మానం



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల పరిధిలోని రాఘవాపురం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు,వారి సంక్షేమం కోసం సర్పంచ్ యరుకల యతీశ్వర్ గౌడ్ బీమా బాండ్లను అందజేశారు. ప్రమాదాలు లేదా అనుకోని పరిస్థితుల్లో కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ బీమా బాండ్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.అదే విధంగా ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.గ్రామ అభివృద్ధి,పారిశుద్ధ్య నిర్వహణలో విశేష సేవలు అందిస్తున్న సిబ్బందికి శాలువాలు కప్పి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహమ్మద్ మున్నీ, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్,వార్డుసభ్యులు మూషం శ్రీనివాస్,కూరెళ్ళ మహేష్,కూరపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు బీమా బాండ్లు

### వారు చేసే సేవలకు సన్మానమే సరైన గౌరవం



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల పరిధిలోని మొరిపిరాల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు,వారి సంక్షేమం కోసం మొరిపిరాల గ్రామ సర్పంచ్ అంబోజు ధనమ్మ శంకరయ్య,కార్యదర్శి రాఘవేందర్ బీమా బాండ్లను అందజేశారు.అనంతరం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్ధన్ రెడ్డి,వార్డ్ సభ్యులు ముప్పిడి ప్రవీణ్,ఫీల్డ్ అసిస్టెంట్ గోపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన.. వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపిన.. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు,నూతనంగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన.వేం నరేందర్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక శు భాకాంక్షలు తెలిపిపిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని,పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షించారు,అలాగే కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధిక సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరడం జరిగింది.

## ముస్లిం ఆడపడుచులకు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** పిస్తా హౌస్ మరియు యూబీ గార్డెన్ యజమాని చంద్ భాయ్ ఆహ్వానం మేరకు నిర్వహించిన ఒక గొప్ప సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం నాకు లభించింది. ప్రతి సంవత్సరం వారు సుమారు 3000 మంది పేద మరియు అవసరమైన వారికి చీరలు మరియు రంజాన్ పండుగకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తూ, వారు గౌరవంగా మరియు ఆనందంగా ఈద్ పండుగను జరుపుకునేలా చేయడం నిజంగా అభినందనీయమైన విషయం.

ఇలాంటి మానవతా కార్యక్రమాలు పవిత్రమైన రంజాన్ నెల ఆత్మను ప్రతిబింబిస్తాయి --- పంచుకోవడం, కరుణ మరియు అవసరమైన వారి పట్ల సహానుభూతి చూపడం వంటి విలువలను సమాజానికి తెలియజేస్తాయి. ఈ కార్యక్రమం సమాజానికి ఒక గొప్ప ఆదర్శంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేద్ భాయ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం నాయక్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శేఖర్ నాయక్, కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్ మరియు ఇతర నాయకులతో కలిసి నేను పాల్గొన్నాను. ఈ మంచి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఇచ్చిన చంద్ భాయ్, జుబేర్ సాబ్ మరియు పిస్తా హౌస్ మేనేజ్‌మెంట్‌కు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు.

# కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పి) వ్యవస్థాపకుడు, దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నాయకుడు కాన్షీరామ్ అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అని నివాళులర్పించారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్ పల్లి - అద్దంకి స్టేట్ హై వే వై జంక్షన్ వద్ద పలు సంఘాల నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్షీరామ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాల నుండి స్ఫూర్తి పొంది, సమాజంలో మార్పు కోసం ఉద్యమించారన్నారు. బహుజనుల (దళిత, వెనుకబడిన, మైనారిటీ వర్గాలు) సంక్షేమం కోసం 1984లో బిఎస్పీని స్థాపించి, ఓటు మనది - సీటు మనది అనే నినాదంతో రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు.

సామాజిక న్యాయం కాకూడదు, సామాజిక పరివర్తన కావాలని ఆయన నమ్మారు, అంటే పాలకులను మార్చడం ద్వారానే సమాజం మారుతుందని బోధించారన్నారు.

మనం ఓట్లు వేయడమే కాదు, ఓట్లు వేయించుకునే స్థాయికి ఎదగాలని చెబుతూ, అణగారిన వర్గాలను ఏకం చేసి, ఉత్తరప్రదేశ్‌లో బహుజన ప్రభుత్వాన్ని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. జీవితాంతం వివాహం చేసుకోకుండా, స్వార్థం లేకుండా బహుజనుల ఆత్మగౌరవం కోసం బతికిన మహనీయుడని ఆయన కాన్షీరామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ, సమానత్వం, గౌరవం కోసం పోరాడటమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళులన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, కౌన్సిలర్ ఎ.అశోక్ నాయక్, బిసి విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మారం శ్రీనివాస్, దాసరాజు జయరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, ముండ్లగిరి కాంతయ్య, నాగేష్, వైహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, డిఎస్పి నాయకులు తరి ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ ఎస్కె.జానీ, దళిత బహుజన సంఘాల నాయకులు మొండికత్తి లింగయ్య , రవిరాల అంజయ్య, ఎండి.ఫారుఖ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా మార్చాలని సిపిఎం నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య

### దీక్షా శిబిరం స్థల పరిశీలన





**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని పడకలుగా మార్చి బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగే నిరువదిక నిరాహార దీక్షలో మండల పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. సోమవారం నుండి నిర్వహించే నిరవధిక నిరాహార దీక్షల స్థలాన్ని మండల నాయకులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతంలో అనేకమంది పేదలకు వైద్యం అందించిన ప్రభుత్వ ఆసుపత్రి నేడు దుర్భర పరిస్థితిలో కనీస సౌకర్యాలు లేకుండా వెలవెలబోతుందని పాలకుల చిన్నచూపుకు నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తోందని అన్నారు.వైద్యం సక్రమంగా అందక అనేకమంది దూరప్రాంతాలకు పోయి వైద్యం చేయించుకొని ఆర్థిక భారం మోయాల్సి వస్తుందని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు పోతున్నవని బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాసుపత్రికి నిధులు కేటాయించి నూతన భవన నిర్మించాలని నిర్వహించబోయే నిరవధిక నిరాహార దీక్షలో అన్ని వర్గాల ప్రజలు రాజకీయాల కతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి,బోయిని ఆనంద్,కందుల హనుమంతు, గొరిగెసోములు,గాదె నరేందర్,నాగటి ఉపేందర్, వేముల సైదులు,మునికుంట్ల లెనిన్,శానగొండ రాము,కూనూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ఆకలి కేకలు కాంగ్రెస్ సర్కార్‌కు వినిపించవా?

### మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు

### ప్రీ-ప్రైమరీ పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను రేవంత్ సర్కార్ నిర్వీర్యం చేస్తోంది



**సిద్దిపేట, జిల్లా అక్షిత ప్రతినిధి ;** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం సిద్దిపేటలో 'తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్' ప్రతినిధులు ఆయనను కలిసి తమ సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల గోడు విన్న హరీశ్ రావు, వారికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు రూ. 18 వేల వేతనం ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక విషయాన్నే మర్చిపోయిందని హరీశ్ రావు విమర్శించారు. అంగన్‌వాడీల ఆకలి కేకలు ఈ ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమం కోసం తీసుకువచ్చిన జీవో నెం. 8 అమలులో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని నిలదీశారు. ప్రీ ప్రైమరీ స్కూళ్ల పేరుతో రేవంత్ సర్కార్ అంగన్‌వాడీ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు, గర్భిణీలకు సేవలందిస్తున్న ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్ల పేద ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆలోచనలు అంగన్‌వాడీల ఉపాధిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. అంగన్‌వాడీల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వారి పక్షాన గళమెత్తుతామని హరీశ్ రావు స్పష్టం చేశారు. వెంటనే మేనిఫెస్టో హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫణిగిరి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు

# ఘన సన్మానం

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ సిబ్బందికి అరుదైన గౌరవం**

**ఎండా వాన తేడా లేకుండా పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు శాలువాలతో సన్మానం**

**పరిశుభ్ర గ్రామమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది**

**ఫణిగిరి గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి**



**నాగారం అక్షిత న్యూస్:** మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఫణిగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికులకు ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలను గుర్తించి గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమైనదే అయినప్పటికీ గ్రామ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో గొప్ప వని, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, ఆ బాధ్యత పారిశుద్ధ కార్మికులు ఎంతో నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఎండా వాన తేడా లేకుండా తెల్లవారుజాము నుంచి గ్రామ వీధుల్లోకి వచ్చి మురికి కాలువలను శుభ్రం చేయడం, చెత్త చెదారాన్ని తొలగించడం, దోమలు మరియు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్త తీసుకోవడం వంటి పనులను వారు అత్యంత కష్టపడి నిర్వర్తిస్తున్నారని వారిని కొనియాడారు. ప్రస్తుతం గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ రేపద్యంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. గ్రామంలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని, గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు ఎప్పటికీ మరువలేవని తెలిపారు. గ్రామాన్ని స్వచ్ఛందంగా, అందంగా ఉంచడంలో వారు చేస్తున్న కృషి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ పరిశుభ్రత కోసం గ్రామపంచాయతీ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ఉపసర్పంచ్ వల్లాల భాను ప్రకాష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అనేది కేవలం ప్రజాప్రతినిధుల వల్ల మాత్రమే సాధ్యం కాదని, గ్రామ సిబ్బంది మరియు పారిశుద్ధ కార్మికుల సహకారం కూడా ఎంతో అవసరమని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరంగా ఉంటాయని, ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వట్టె సురేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కసిరెడ్డి రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నరసింహారెడ్డి, దేవాలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, మరియు గ్రామస్తులు ఈ కార్యక్రమము సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు.

## ఆర్థిక సహాయం అందజేత



**మందమర్రి, అక్షిత ప్రతినిధి :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గంగాకాలనీకి చెందిన నామారపు లెనిన్ బాబు గత ఐదు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ వాసులు యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు వెంటనే స్పందించారు. యువత అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ దాతల సహకారంతో రూ. 16,500 నగదు ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా యువత అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ మాట్లాడుతూ, సహాయం అందించిన దాతలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో అవసరమైన వారికి తోడ్పడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగాకాలనీకి డిష్ వెంకన్న, బాలాజీ, రమేష్, సంపత్, రామారావు, కట్ల రమేష్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండలో ఎమ్మెల్యే దొంతి పరామర్శలు

**చల్లా శ్రీపాల్ రెడ్డి, కొల్లి వెంకటసుబ్బారెడ్డి కుటుంబాలకు పరామర్శ**





**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం మండల కేంద్రంలో పర్యటించి పలువురిని పరామర్శించారు. ప్రమాదవశాత్తు వెన్నుముకకు గాయమై చికిత్స పొంది ఇంటికి చేరిన చల్లా శ్రీపాల్ రెడ్డి తల్లిని ఎమ్మెల్యే కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, మెరుగైన వైద్యం అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం, ఇటీవల మరణించిన మండల కాంగ్రెస్ కోశాధికారి కొల్లి వెంకటసుబ్బారెడ్డి తమ్ముడు కొల్లి రమణారెడ్డి దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. రమణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రమణారెడ్డి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఇదునూరి సాయికృష్ణ, ఆవుల శ్రీనివాస్, మాదటి శ్రీనివాస్, రాచకొండ రఘు, కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, చల్లా శ్రీపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, షైక్ షబ్బీర్, అన్వర్, పాపిరెడ్డి, గరికపాటి కృష్ణారావు, బిక్షపతి, లక్ష్మారెడ్డి, రావుల తిరుపతి రెడ్డి, గట్ల వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫణిగిరి ఈటూరు క్రాస్ రోడ్డులో

# ఎల్ఈడి లైట్లు ఏర్పాటు

**రోడ్డు భద్రతపై అవగాహన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి**

**గంజాయి వంటి మత్తు పదార్థాలు డ్రంక్ అండ్ డ్రైవ్ కు కఠిన చర్యలు**

**ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కవర్తవ్యం**

**నాగారం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. చిరంజీవి**




**నాగారం అక్షిత న్యూస్ :**ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని నాగారం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. చిరంజీవి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఫణిగిరి, ఈటూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవుట్ డోర్ ఎల్ఈడి ప్లాంట్ లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఆ ప్రాంతంలో చీకటి ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించిన స్థానిక పోలీసులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఈ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్. చిరంజీవి మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనదారులు రోడ్లపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. చాలామంది నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదాలు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, పోలీసుల సూచనలను పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని అన్నారు. యువత సమాజ భవిష్యత్తు అని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలను కూడా సమస్యల్లోకి నెట్టేస్తాయని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నియంత్రణలో యువత పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా గంజాయి లేదా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలకు ప్రధాన కారణమని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో యశాంతిభద్రతలు కాపాడటం కోసం ప్రజలు పోలీసులు కలిసి పనిచేస్తేనే సమాజంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈటూరు గ్రామ సర్పంచ్ వంగూరి దామోదర్, ఫణిగిరి గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగి ఆవిలయ్య, బాల్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్



**మందమర్రి, అక్షిత ప్రతినిధి :** రామకృష్ణాపూర్ పట్టణంలోని 13వ వార్డు గణేష్ నగర్ ప్రాంతానికి చెందిన నాగెల్లి శ్రీనివాస్ ఇటీవల హైదరాబాద్‌లో భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ తన సతీమణి సునందతో కలిసి ఆదివారం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పురాణం సతీష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్ట గౌడ్, పైసా రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## పేద యువతి వివాహానికి 'పుస్తె మట్టెలు' అందజేసిన సర్పంచ్ భానుచందర్



**సిద్దిపేట, జిల్లా అక్షిత ప్రతినిధి:** సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జక్కాపూర్ గ్రామ సర్పంచ్ భానుచందర్ అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన సాదుల మల్లయ్య కుమార్తె వివాహం సందర్భంగా, సర్పంచ్ తన సొంత సహకారంతో పెళ్లి కుమార్తెకు 'పుస్తె మట్టెలు' పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో తమ వంతు సాయంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. గ్రామంలో అర్హులైన వారు, ఆపదలో ఉన్న వారికి అండగా ఉండటానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నాయకులు, యువకులు సర్పంచ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కష్టకాలంలో తమను ఆదుకున్న సర్పంచ్ భానుచందర్ గారికి, మల్లయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శామీర్ పేట్‌లో రంజాన్ తోఫా పంపిణీ



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** రంజాన్ మాసం ను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న రంజాన్ తోఫా దుస్తుల కిట్ల ను శామీర్ పేట్ మండల కేంద్రంలోని జామ మసీద్ లో నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబుద్దిన్, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మహమ్మద్ షఫీఉద్దీన్, శామీర్ పేట్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శంకర్ గౌడ్, శామీర్ పేట్ మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ డప్పు సాయి బాబా,

మాజీ కో-ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మాజీ వార్డు సభ్యులు ఇర్ఫాన్, సొగడి రాజు, నాయకులు అశోక్, ఆంజనేయులు, వంగా నర్సింహా రెడ్డి, సాయి పేట్ శ్రీనివాస్ యాదవ్, అఫ్జల్ ఖాన్, నిసార్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత






**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చార్జ్ అధికారులు, అదనపు చార్జి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, చార్జింగ్ అధికారులు నిర్వహిస్తారని, చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని తెలిపారు. సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు. 15, 16, 17 రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి గురువయ్య, జిల్లా సెన్సెస్ అధికారులు వినయ్, గంగయ్య, తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మాస్టర్ ట్రైనర్ ఊషన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### బిటెక్,ఎంబిఏ మొదటి సంవత్సరం

# ఫైనల్ పరీక్షా ఫలితాల్లో సాయి స్ఫూర్తి అగ్రస్థానం









**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** బిటెక్ ,యం బిఏ మొదటి సంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాలు జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు శనివారం విడుదల చేశారు. గంగారంసాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచి కళాశాల ఘనతను పునరావృతం చేసారని సాయి స్పూర్తి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరిశేషారత్నకుమారి సంయుక్త ప్రకటనలో తెలియజేసారు. బ్రాంచీల వారీగా విద్యార్థులు సాధించిన ఫలితాలు. ట్రిపుల్ ఈ: 1.25సి51ఎ0208 ఎక్కిరాల. శిరీష, 7.67ఎస్జీపిఎ, 71.7%ఫస్టుర్యాంకు, 2.25సి51ఎ0222పేటేటి. లక్ష్మీకార్తీక్7.67ఎస్జీపిఎ, 71.7%ఫస్ట్, 3.25సి51ఎ0206చాడ. దీపక్7.33ఎస్జీపిఎ, 68.3%సెకండ్02. ఈసిఈ: 1.25సి51ఎ0415 గుగులోతు. గణేష్, 9.43 ఎస్జీపిఎ 89.3%ఫస్ట్, 2.25సి51ఎ0454 అరిచేపల్లి. సాయికుమార్, 8.86 ఎస్జీపిఎ, 83.6%సెకండ్, 3.25సి51ఎ0422మహ్మద్ అయేషాఫాతిమా, 8.62 ఎస్జీపిఎ, 81.89%థర్డ్, 3.సియస్ సి: 1.25సి51ఎ0569పాలెం. రమ్యస్ఫూర్తి, 9.7ఎస్జీపిఎ 92%ఫస్ట్, 2.25సి51ఎ0525గుదే. రమ్యకృష్ణ, 8.9ఎస్జీపిఎ, 84%సెకండ్, 3.25సి51ఎ0575రెసోజు. నాగవెంకట సాయిశ్రుతి 8.6ఎస్జీపిఎ 81%థర్డ్, 04.సియస్.యం: 1.25సి51ఎ6606బమ్మిడి. కళాంజలి9.25ఎస్జీపిఎ87.5%ఫస్ట్. 2.25సి51ఎ6628 కోడిగంటి. సత్యవాణి 9.1 ఎస్జీపిఎ 86%సెకండ్. 3.25సి51ఎ6633 మహమ్మద్. ఐనస్ జోహా8.95 ఎస్జీపిఎ 84.5%థర్డ్. 4.25సి51ఎ6643రంగిశెట్టి. చంద్రిక8.95 ఎస్జీపిఎ 84.5% థర్డ్, 05.ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్: 1.25సి51ఎ7212చాగంరెడ్డి. దివ్యవాణి9.25ఎస్జీపిఎ87.5%ఫస్ట్. 2.25సి51ఎ7248 పఠాన్. సునేలి9.05 ఎస్జీపిఎ 85.5%సెకండ్, 3.25సి51ఎ7251పోలిశెట్టి. వైష్ణవిసత్య9.0ఎస్జీపిఎ85%థర్డ్. 06.యంబిఏ: 1.25సి51ఇ0024కిష్టం. సాయికృష్ణ8.59ఎస్జీపిఎ80.09%ఫస్ట్, 2.25సి51ఇ0043 పిల్లెం. కృష్ణవేణి 8.52 ఎస్జీపిఎ 80.2%సెకండ్, 3.25సి51ఇ0046 పొన్నంపల్లి. మధుమిత8.37ఎస్జీపిఎ78.7% థర్డ్ అను సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ఏవరేజ్(ఎస్జీపిఎ)తో బ్రాంచీల వారీగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈకార్యక్రమంలోప్రముఖపారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీఅధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్. డాక్టర్. బండి. పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి. అన్విద వర్చువల్ గా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థినీ, విద్యార్థుల కృషి అభినందనీయన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్ లో తమకళాశాల విద్యార్థినీ, విద్యార్థులు అధిక మార్కులు సాధించిన వారికి గ్రేడ్ పాయింట్స్ కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మంచి ఫలితాలుసాధించినవిద్యార్థినీ, విద్యార్థులకు అభినందించారు. కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పాముల. శేఖర్ బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్. యాకూబ్, కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్. మీరాసాహెబ్ మరియు అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు మొదలగువారు విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు.

# రిటైర్డ్ ఉద్యోగులను రోడ్డుపైకి తెచ్చిన రేవంత్ సర్కార్

### మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం

### కమిషన్ల కోసం మూసి పేరుతో నిధుల మళ్లింపు

### 60 మంది రిటైర్డ్ ఉద్యోగుల మృతికి రేవంత్ రెడ్డి బాధ్యుడు



**సిద్దిపేట, జిల్లా అక్షిత ప్రతినిధి:** తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు...35 ఏళ్ల పాటు సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను రేవంత్ రెడ్డి రోడ్డుపైకి తెచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం పెండింగ్ డీఏలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో లక్షన్నర కోట్లు ఖర్చు చేయడానికి, బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి, ఇతర రాష్ట్రాల ఎన్నికలకు నిధులు పంపడానికి రేవంత్ రెడ్డికి మనసు వస్తుంది కానీ, ఉద్యోగుల దాచుకున్న రూ. 10 వేల కోట్ల బకాయిలు ఇవ్వడానికి రావడం లేదు అని విమర్శించారు. కమిషన్లు ఇచ్చే వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.పెన్షన్ బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు 60 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, ఈ చావులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇంకెన్ని ప్రాణాలు పోతే ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని ప్రశ్నించారు.కేసీఆర్ హయాంలో 92 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయితే, నెల రోజుల్లోనే వారికి రావాల్సిన ప్రయోజనాలన్నీ చెల్లించామని గుర్తు చేశారు. కానీ నేడు 3 లక్షల కోట్ల బడ్జెట్ పెడుతూ, లక్షన్నర కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం, అందులో 10 వేల కోట్లు ఉద్యోగుల కోసం కేటాయించలేకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయులను అవమానించేలా విద్యా కమిషన్ రిపోర్ట్ ఉందని, రైతులను, మహిళలను కూడా ఈ ప్రభుత్వం మోసం చేసిందని హరీష్ రావు అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల గొంతుకగా అసెంబ్లీలో పోరాడతామని, ప్రభుత్వంపై ఉద్యోగులందరూ సంఘటితమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.





# వినియోగదారులు హక్కులను సాధించాలి

### మార్కెట్‌లో అక్రమాలను అంతమొందించాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం పిలుపు



**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "వినియోగదారులు హక్కులు సాధించాలి – వ్యాపార మార్కెట్‌లో అవినీతి, అక్రమాలను అంతమొందించాలి" అనే నినాదంతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులు తాము కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు లేదా పొందే సేవకు తప్పనిసరిగా నగదు రశీదు తీసుకోవాలని సూచించారు. రశీదు ఉన్న పక్షంలో ఏదైనా అన్యాయం లేదా సేవా లోపం జరిగితే ఒక్క పైసా ఖర్చు లేకుండా ఐదు లక్షల రూపాయల వరకు విలువ చేసే అంశాలపై 90 నుండి 150 రోజుల్లోపు వినియోగదారుల కమిషన్ ద్వారా వడ్డీతో సహా పరిహారం పొందవచ్చని వివరించారు. వస్తువుల కల్తీ, నకిలీలు, గరిష్ట విక్రయ ధర కంటే ఎక్కువకు అమ్మడం, గడువు ముగిసిన వస్తువుల విక్రయం వంటి మోసాలకు గురైతే వెనకడుగు వేయకుండా ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా శీతలీకరణ యంత్రాలు, గాలి యంత్రాలు వంటి విద్యుత్ ఉపకరణాలు పూచీకత్తు కాలంలో పాడైతే అమ్మకందారు బాధ్యత వహించాల్సిందేనని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం జిల్లా ఆహార సలహా కమిటీ సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ వస్తువులతో పాటు ఆసుపత్రి సేవలు, ప్రయాణ సౌకర్యాలు, విద్యుత్, భీమా వంటి రంగాల్లో లోపాలు తలెత్తినా జిల్లా వినియోగదారుల న్యాయస్థానంలో అంతర్జాలం ద్వారా లేదా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సలహాలు, ఫిర్యాదుల కోసం ప్రభుత్వ ఉచిత సమాచార నంబర్లు 1915, 1800 11 1915 లేదా వాట్సాప్ నంబర్ 8800001915 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కన్వీనర్ బోయిన వెంకటస్వామి, సభ్యులు వేంకటాచారి, గణేష్, ఫిరోజ్ ఖాన్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉడిత్యాల గ్రామంలో శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహణలో పాల్గొన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయం భూమి పూజ కార్యక్రమంలో నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తవాలని దేవిని ప్రార్థించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఆలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని, ఇలాంటి దేవాలయాల నిర్మాణం గ్రామంలో భక్తి, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని అన్నారు.

## సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తేనే పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు.గోలేటి గ్రామ పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు జమ్మిడి అరుణ్ , మిడిగొండ లక్ష్మి – లింగమూర్తి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఆర్యవైశ్య నూతన కమిటీ ఎన్నిక



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** తిరుమలగిరి మండల ఆర్యవైశ్య కమిటీ నూతనంగా ఎన్నుకోబడిన మండల అధ్యక్షులు తాటిచెట్టి రమేష్, పట్టణ అధ్యక్షులు తునికి పాటి రాంబాబు ను సన్మానించిన తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాపాక సోమేశ్ ఇరువురిని సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో శ్రీధర్, గబ్బెడ సంపత్ కుమార్, తిపిరిశెట్టి లక్ష్మణ్, బొక్క శ్రీనివాస్, వీర ప్రసాద్, సందీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాన్యవర్ కాన్సిరాం

## ఘనంగామాన్యవర్ కాన్షిరాం 92వ జయంతి వేడుకలు



**అక్షిత న్యూస్ మునగాల:** సామాజిక న్యాయం, సమానత్వం,స్వాభిమానం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు,బహుజన ఉద్యమ పితామహుడు మాన్యవర్ కాన్సిరాం 92వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మునగాల మండల పరిధిలోని కలకోవ గ్రామంలో అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో,ఘనంగా వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరిగింది.మాన్యవర్ కాన్షిరాం భారతదేశంలో అణగారిన వర్గాలైన ఎస్సీ,ఎస్టీ,బీసీ మరియు మైనారిటీల హక్కుల కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నాయకుడు. "బహుజనులే దేశానికి అసలు శక్తి"అనే భావజాలంతో ఆయన సమాజంలో చైతన్యం కలిగించారు.ఆయన స్థాపించిన భోజన సమాజ్ పార్టీ ద్వారా బహుజన వర్గాలకు రాజకీయ ప్రతినిధిత్వం కల్పించేందుకు నిరంతరం కృషి చేశారు.

కాన్షిరాం, ఆలోచనలు కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాలేదు. సామాజిక మార్పు కోసం విద్య,చైతన్యం మరియు సంఘటిత శక్తి అవసరమని ఆయన ప్రజలకు తెలియజేశారు.అణగారిన వర్గాల స్వాభిమానాన్ని, పెంపొందించడంలో, ఆయన చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఈ సందర్భంగా యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసంపనిచేయాలనిపిలుపు నిస్తున్నాము.బహుజన సమాజం ఐక్యంగా ఉంటేనే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని కాన్షిరాం, సిద్ధాంతం మనకు మార్గదర్శకం.మాన్యవర్ కాన్షిరాం గారి 92వ జయంతి సందర్భంగా ఆయనకు మనమందరం వినమ్రంగా ఘన నివాళు లు అర్పిస్తూ,ఆయన ఆశయ సాధన కోసం కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేయడం జరిగింది,

ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లాప్రధాన ప్రతినిధి పాతకోట్ల నాగరాజు,బీఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి మాతంగి ఏసుబాబు, కోదాడ నియోజకవర్గ స్వేరోస్ కార్యదర్శి గద్దల మోహన్ కుమార్ ,బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి చిర్ర శ్రావణ్ కుమార్,ఉప్పరి సందీప్,బొడ్డుపల్లి నికేష్, మునగలేటి వెంకటేష్,చిర్ర ప్రదీప్,గోవర్ధన్,వంశీ,విక్రమ్, గణేష్,రిషి,నెమ్మది రాజు, రాజేష్,వినయ్,గోపి,చిర్రా వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**కాశీబుగ్గ , అక్షిత న్యూస్ :** వరంగల్ నగరం19వ డివిజన్ లోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం వీధిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం. ముఖ్య అతిథిగా వరంగల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న కుమార్ రావడం జరిగింది. ఇందులో భాగంగా నల్ల సతీష్, ఉమ దంపతుల ఇంటిని ప్రారంభించడం జరిగింది. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. పేదలకు ఇది ఒక వరం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే కట్టుకోలేని వారు ఏజెన్సీ ద్వారా ఐదు లక్షల వరకు కట్టుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యాక్రమంలో డివిజన్, కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ , ఆర్. ఐ. ప్రతిభ, హౌసింగ్ బోర్డ్ ఆఫీసర్ సన్నిహిత, లక్ష్మారెడ్డి, వార్డ్ ఆఫీసర్ అక్షయ్ కుమార్, బిల్ కలెక్టర్ వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాదినేని మల్లేశం, కుటుంబ సభ్యులు నల్ల అనసూర్య, , రవి , కవిత, శ్రవణ్ రమాదేవి, మోహన్ , పద్మ, నల్ల.మహేష్. శేషు, అరవింద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామంలో పారిశుద్ధ కార్మికుల సన్మాన కార్యక్రమం కిట్ల పంపిణీ గ్రామ పరిశు భ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించేందుకు గ్రామ సర్పంచి బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. పరిశుద్ధ కార్మికులకు సబ్బులు షాంపూలు ఇచ్చి శాలువ కప్పి పూలమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ, వాడు మెంబర్స్ బొజ్జం మల్లేష్ మంగ శ్రీనివాస్ రాధా కుమార్ శిరీష మహేందర్ ఆశ వర్కర్ మమత గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్ళండి

### కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పట్టణ ప్రజలకు కాజిపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో 2020 నుండి 2024 మధ్యలో ద్విచక్ర వాహనాదారులు డ్రంకెన్ డ్రైవ్, వితౌట్ డ్రైవింగ్ లైసెన్సు కేసు, పెండింగ్ చలాన్ కేసులో ఇతర ఏదైనా కారణం తో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ వారికి పట్టుబడిన వాహనాలు ట్రాఫిక్ పోలీస్ వారి అధీనంలో ఉన్న వాహనాలు సంబంధిచిన పత్రాలు తీసుకొని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కి వచ్చి వాహనాన్ని తీసుకెళ్లొచ్చని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ప్రజలకు సూచించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

### పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం




**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, డి.ఎం.అండ్.హెచ్.ఓ సీతారాం , కౌన్సిలర్ వెంకటేశ్వర్లు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ పట్టణాన్ని శు భ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ఎండ, వాన అని చూడకుండా కష్టపడే కార్మికుల ఆరోగ్యం తమకు ముఖ్యమని, అందుకే ప్రభుత్వం ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకొని పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్య బృందం కార్మికులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన సలహాలు అందించారు. అనంతరం కార్మికులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రామయ్య, టిఆర్ఎస్ నాయకుడు సాయి శ్రావణ్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు తోప కీట్లు పంపిణీ



**గుండాల/అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా మరిపడిగా గ్రామ ముస్లిం సోదరుల కుటుంబాలకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య మరియు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో మరిపడిగ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండబోయిన నర్సింహ్మా,ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు నిత్యవసర సరుకులను సర్పంచ్ గూడెపు కుమార్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రేమ అనురాగం ఆప్యాయత కులమతాల భేదాలు లేకుండా జరుపుకునే పండుగ రంజాన్ పండుగని అన్నారు. మతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను మైనార్టీ కుటుంబాలకు అందేలా చూస్తామని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా మా కుటుంబాలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈద్కా తోప అందజేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య మరియు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత , ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు తేరాల కిష్టయ్య,నాయకులు బూడిద ఉప్పలయ్య, తాళ్లపల్లి లక్ష్మీనారాయణ, అనంతుల రామ్మూర్తి, సింగారం రాజశేఖర్, అనంతల ఉమేష్, బోయినీ అశోక్, రెడ్డిరాజుల నాగభూషణం, ఎండి ఎగ్బాల్,ఎండి అబ్దుల్ నబీ, ఎండి జాంగిర్, అబ్బాస్, మహబూబీ సోనీ, తదితరులు పాల్గొన్నారు